# హాంఫట్ అన్నయ్యా!

'జన్మభూమి' ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్ నుంచి బయల్దేరింది.

'నా జన్మభూమి ఎంతో అందమైన దేశమూ' అంటూ మెల్లిగా పాడుకుంటోంది ఓ మహిళ.

"రైలు కూత వెయ్యకుండానే బయల్దేరిందేమిటి!" అన్నాడు ఆ మహిళకి ఎదురుగా కూర్చున్న ఒక మగపురుషుడు.

"పురుషోత్తమ్! నీకు చిలిపితనం పోలేదయ్యా. రైలు వెధవ కూతలు మానేసి చాలారోజులయ్యింది. గార్డు విజిల్ వేశాడు. రైలు బయల్దేరింది" అన్నాడు. పురుషోత్తముడి పక్కన కూర్చున్న ఒక పురుషుడు.

"చిన్నప్పట్నించీ విజిల్ వెయ్యడమంటే నాకు భలే యిష్టం. ఎప్పుడు ఈల వేసినా, గొంతు నులిమేస్తాం అనేవారు మా పెద్దలు. అసలు విజిల్ వేసుకుంటూ చేసే ఉద్యోగం దొరకడం ఎంత అదృష్టం" అన్నాడు, పురుషోత్తమ్.

ఇంతలో, "ఆ జన్మభూమి పాట ఆపెయ్. లేకపోతే రైల్వేవాళ్ళు సర్‌ఛార్జి వేస్తారు" అన్నాడు ఆ మహిళ ప్రాణనాథుడు.

"ఇంట్లో రానుకోనివ్వరు. రైల్లో పాడుకోనివ్వరు"

ఆ 'రానుకోనివ్వరు' అనే మాట విని, ఎవరైనా 'మీరు రచయిత్రా' అని అడుగుతారనుకుంది, ఆ జన్మభూమి గాయకురాలు. ఎవరూ అడగలేదు. ఇది పనికాదని, తను రచయిత్రినని తానే చెప్పుకునే పరిస్థితి కల్పిస్తున్న ప్రయాణీకుల అనాగరికతకు, కొంచెం విసుగుచెంది, "నా సూట్‌కేస్‌లో పైన, మొన్న ప్రింట్ అయిన 'గాయత్రి కథలు' అనే నా కథల పుస్తకం తీసి యివ్వండి. అందులో ఏమైనా తప్పులుంటే దిద్దుతాను. 'సెకండ్ ఎడిషన్' సులువుగా అవుతుంది" అంది తన భర్త గంగాధర్‌తో.

ఆ పుస్తకం పెట్టెలోంచి తీసేలోపులో "మీరు రచయిత్రా మేడమ్. మీపేరు గాయత్రి కదూ! 'నా జన్మభూమి' అనే పాట మీరు పాడుతున్నప్పుడే అనుకున్నాను మీరు రచయిత్రి అయి వుండాలని. 'జన్మభూమి' పేరుగల రైలు ఎక్కినప్పుడు దేశానికి సంబంధించిన పాట పాడడమనేది కవులకీ, రచయితలకీ మాత్రమే సాధ్యం" అన్నాడు ఎదురుగా కూర్చున్న పురుషోత్తమ్.

"ఔనండీ నేను రచయిత్రినే. నా పేరు చెప్పకుండానే, నా పేరు 'గాయత్రి' అని తెలుసుకున్నారే"

"మొన్న దీపావళి కథల పోటీలో మీకు మొదటి బహుమతి వచ్చినట్లు [illegible] మీ ఫోటో వేశారు కదా! మీ ఫోటో నా మనస్సులో చెరగని

ముద్ర వేసింది" అన్నాడు పురుషోత్తమ్.

'నా భార్య ఫోటో నీ మనస్సులో చెరగని ముద్ర వెయ్యడమేమిట్రా' అనుకుంటూ యిటువంటి అవాకులూ చెవాకులూ ఇంకా పేల్తాడేమోనని, "నా పేరు గంగాధర్. ఈమె భర్తని" అని పరిచయం చేసుకున్న గంగాధర్‌తో, "మిమ్మల్ని కూడా కలవడం చాలా సంతోషంగా వుంది" అన్నాడు, పురుషోత్తమ్.

"ఇదిగో నీ పుస్తకం" అంటూ గాయత్రికి అందించాడు.

"ఓసారి మీ పుస్తకం యివ్వండి" అంటూ అందిపుచ్చుకున్నాడు పురుషోత్తమ్.

పుస్తకం వెనుక వైపుననున్న ఆమె ఫోటో చూసి "అరే! ఈ ఫోటోలో చాలా సన్నగా వున్నారు మేడమ్"

'ఇకనేం మరి! ఆ బహుమతి ఫోటోయొక్క ముద్ర చెరిపేసుకుని, నీ మనస్సులో ఈ ఫోటో ముద్రించుకో" అనుకున్నాడు, గంగాధర్, తన భార్యతో ఎక్కువ పరిచయం లేకుండానే చనువుగా మాట్లాడుతున్న వాడిమీద మంటతో.

'అయితే నేను సన్నబడ్డానన్నమాట' అనుకుని సంతోషిస్తూ "మనం తెచ్చుకున్న యిడ్లీలో ఓ నాలుగు అన్నయ్యగారికి పెట్టండి" అంది గాయత్రి.

ఎప్పుడూ తమతోపాటే ప్రయాణాలు చేస్తూ, తాము తెచ్చుకున్న తినుబండారాలు తినేసి త్రేన్చే బావమరిది ఈసారి రాలేదుకదా అని సంతోషిస్తున్న గంగాధర్‌కి, ఈ పురుషోత్తమ్ అన్నయ్య తగులు కున్నందుకు దుఃఖం కలిగింది. బామ్మర్దికూడా రాలేదన్న సుఖం లేకుండా వాడు లేని లోటు భర్తీ చేస్తున్నాడు ఈ వరస బామ్మర్ది.!

ఆ నాలుగిడ్లీలు ముగించిన పురుషోత్తమ్‌తో, "మీరు సన్నగానే వున్నారు. యింకో రెండు లాగించండి అన్నయ్యా" అని ఉత్సాహ పరిచింది గాయత్రి.

"వద్దమ్మా! మధ్యాహ్న భోజనం దెబ్బతింటుంది. ఆ! తర్వాత యిప్పుడే చెపుతున్నాను. మధ్యాహ్నం భోజనాలు నావి"

'భోజనాలు వీడివి అంటే ఏమిటో! మా భోజనాలు కూడా వీడే తింటాడా, లేకపోతే భోజనాల ఖర్చు వీడిదనా?" అనుకున్నాడు గంగాధర్.

"అయ్యో! ఏమిటన్నయ్యా మీరు మరీనూ! నిత్య అన్నదాన సత్రం నడిపించిన వంశం మాది. భోజనాల ఖర్చు మీరు భరించట మేమిటి? అయినా మధ్యాహ్న భోజన ఏర్పాటుతోనే వచ్చాం. నేను ఇద్దరికి భోజనం తెస్తే అది నలుగురయిదుగురికి సరిపోతుంది"

'నీదేంపోయింది. వాడు నిన్ను రచయిత్రి అన్నాడో లేదో, ఇక వాడ్ని మేపడం మొదలెట్టావ్. ఆ మధ్యన ఓసారి పత్రికలో తెలియ పరిచిన అడ్రస్‌ను బట్టి యింటికి

వచ్చి నిన్ను పొగిడి నాలుగు వందలు స్వీకరించి పోయాడు ఒకడు.! అయినా నీకు బుద్ధి రాలేదు' అనుకున్నాడు గంగాధర్.

"ఇంతలో అసలు మీరు కథలు రాసే ముందు కొన్ని ముఖ్యమైన విషయాలు ఓ కాగితం మీద రాసుకుంటారా! ఆ దీపావళి కథల పోటీలో వచ్చిన బహుమతి కథలోని విషయం మీ సొంత ఆలోచనయేనా, మా బావగారేమైనా ఉప్పు అందించారా?"

"ఉప్పా! పప్పా! ఆయన మొహం. చదివింది అర్థం చేసుకుంటే అదే పదివేలు. ఆయనకి సొంత ఆలోచనలు కూడానా!"

"అదే అనుకున్నాను నేను కూడా! మగవాళ్ళ ఆలోచనా దృక్పథం ఆ కథలో కనిపించలేదు. ఈ పుస్తకం అచ్చు వేయించడానికి చాలా ఖర్చయివుండాలి. మరి పుస్తకాలేమైనా అమ్ముడుపోతున్నాయా? "ఓ పాతిక పుస్తకాలు నాకియ్యమ్మా. నేను నా ఫ్రెండ్స్‌కి అమ్మేసి నీకు డబ్బు పంపిస్తాను. ఎడ్వాన్స్‌గా కొంత డబ్బు యిప్పుడిచ్చెయ్యమంటే యిస్తాను" అన్నాడు పురుషోత్తమ్.

"అయ్యో ఎంతమాట! అసలు ఆ మాత్రం చెయ్యడమే గొప్ప అన్నయ్యా, పైగా అడ్వాన్స్ యివ్వడమేమిటి!"

ఇంతలో కూల్‌డ్రింక్స్ అమ్మకానికి వచ్చాయ్. "బాబూ! ఓ మూడు కూల్‌డ్రింక్స్ యిమ్మంది" గాయత్రి.

గంగాధర్ తనకి వద్దన్నాడు. అలా అయినా వాళ్ళు తాగిన కూల్‌డ్రింక్స్‌కి పురుషోత్తమ్ డబ్బులిస్తాడేమోనని.

డ్రింక్ తాగి పెద్దగా త్రేన్చి, పర్స్ తీస్తున్నట్లు నటించాడు కాని ఒక్క పైసా బయటకి తీయలేదు. పుస్తకాలు ఎలాగో అమ్మిపెడతాడు కదానని, డబ్బులు గాయత్రి ఇచ్చేసింది.

"ఎలాగైనా నీ దర్జాయే వేరమ్మా" అన్నాడు పురుషోత్తమ్.

"ఈ ప్రయాణానికి ఓ పదివేలు పి.ఎఫ్. నుంచి అప్పు తీసుకున్నది నేను, దర్జాయేమో ఆవిడది' అనుకున్నాడు గంగాధర్.

మధ్యాహ్నం భోజనాలయినాయి. నాలుగు గంటలకి వేడి వేడి సమోసా అమ్మకానికి వచ్చాయ్.

"ఓ నాలుగు సమోసాలు తినండి అన్నయ్యా" అంది గాయత్రి.

"సాస్ లేకుండా సమోసా సహించదమ్మా"

"ఓ టమోటా సాస్ సీసా మాతోకూడానే వుంది" అంది గాయత్రి.

"అన్నదాన సత్రం నడిపించినవారికి సాస్ ఓ లెక్కా"

"అన్నయ్య అన్నది విన్నారా! ఆ సాస్ సీసా పైకి లాగండి" అంది గాయత్రి.

కొంచమయినా సాస్ నాకుదామంటే మిగలకుండా చేసి, యించుమించు ఖాళీ సీసా గంగాధర్‌కి ఇచ్చేశాడు.

"మా మేనకోడలు హైదరాబాద్‌లో వుంటుంది. దానికి కథలు రాయడమంటే చాలా సరదా! మా యందు అభిమానం వుంచి, దానికి కథలు రాయడం నేర్పు తల్లీ" అన్నాడు పురుషోత్తమ్.

"అయ్యో అదెంత పని! ఇప్పటికే ఓ నలుగురు శిష్యులు నేర్చేసుకున్నారు. మీ మేనకోడల్ని నా అంతదాన్ని చేస్తాను"

"ఏమమ్మా నువ్ కథలు రాసుకునేటప్పుడు బావ గారు నీకు వంట వార్పులో ఏమైనా సహాయం చేస్తారా?"

"అయ్యో అంత అదృష్టమా! ఓసారి కొంచెం కాఫీ తగలేసి తెండి అంటే, దాన్ని మిరియాల కషాయంలా పొంగించి తీసుకొచ్చారు. ఆ కాఫీ తాగిన నాకు జీవితం మీద విరక్తి కలిగింది అన్నయ్యా"

'కాఫీ కూడా పెట్టలేని సన్నాసివి అన్నమాట' అన్నట్లుగా గంగాధర్ కేసి చూసాడు పురుషోత్తమ్.

ముగ్గురూ వైజాగ్‌లో దిగారు. పాతిక పుస్తకాలు స్వీకరించాడు, ఉత్తమ పురుషుడు కాని పురుషోత్తమ్. పైగా వీళ్ళని వదిలి వెళ్ళిన అయిదు నిముషాల్లో వచ్చి, పర్స్ ఎవడో కొట్టేశాడని చెప్పి, ఓ అయిదు వందలు అప్పుగా యిమ్మని తీసుకుపోయాడు పురుషోత్తమ్.

---

ఓ ఏడాది తర్వాత గంగాధర్ దంపతులు 'జన్మభూమి'లో వైజాగ్ బయల్దేరారు.

"గాయత్రీ నీకు జ్ఞాపకం వుందా క్రిందటి సంవత్సరం నీ పుట్టినరోజు ఓ రెండ్రోజులుందనగా ఇదే ట్రైన్‌లో వైజాగ్ వెళ్ళాం.! జాగ్రత్త ఈసారి కూడా మీ అన్నయ్య యిదే రైల్లో కనిపించి కుచ్చుటోపీ తొడుగుతాడేమో! అప్పుడు చేసిన దానికి, ఆ తర్వాత యిక 'జన్మభూమి'లో ప్రయాణం చేసి వుండడు.

"నీవు రచయిత్రివని నలుగురూ తెలుసుకోవాలనే తాపత్రయం వదిలెయ్. నీ కథలు బాగున్నాయ్ అని అందరూ చెప్పాలనుకోకు. అసలు కథలు బాగా లేకపోతే పత్రికలవాళ్ళు ఎందుకు వేసుకుంటారు. ఈ తాపత్రయం వలననే నీలాంటి వాళ్ళని 'హాంఫట్ అన్నయ్య'లు మోసం చేస్తారు"

"ఈ ఏడాదిలో ఈ మాటలు కనీసం మూడొందల సార్లు చెప్పి వుంటారు. ఇక చాలు వదిలేయండి బాబూ" అంది గాయత్రి.

(ఆంధ్రభూమి వారపత్రిక 6-9-2012)